క్లుప్తంగా

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

వర్గల్(గజ్వేల్): ప్రధాని మోదీ పదకొండేళ్ల పాలనలో దేశాభివృద్ధి కోసం అనేక పథకాలు అమలులోకి తెచ్చారని మండల బీజేపీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం నాచారంలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రమేష్, రవీందర్, యాదగిరి, నర్సింలు, రమేష్, నాగరాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో ప్రయోజనం

దిశ కమిటీ సభ్యురాలు వనజ


అంగన్‌వాడీ బాటలో పాల్గొన్న వనజ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధి రామంచలో బుధవారం అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా దిశ కమిటీ సభ్యురాలు వనజ వర్మ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం అందుతుందన్నారు. చిన్నారులకు ఆటపాటల ద్వారా బోధన చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ


బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న నరేష్, ప్రవీణ్

దుబ్బాక: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, దిశ కమిటీ మెంబర్ సుంకోజి ప్రవీణ్, తునికి సురేష్ ఆదేశించారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని రేషన్ దుకాణాలను వారు సందర్శించి ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను, బియ్యం ఏలా ఉన్నాయే తెలుసుకున్నారు. రెండు రోజుల క్రితమే రేషన్.. ప్రజల పరేషాన్ పేరిట సాక్షిలో కథనం వెలువడడంతో వారు స్పందించి రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పంపిణీ చేపట్టాలని డీలర్లకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని సత్యసాయి దేవాలయంలో సత్యసాయి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం సామూహిక కుంకుమార్చన, కోటి జపయజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు విశ్వనాథ శర్మ మాట్లాడుతూ.. యజ్ఞయాగాలు జరిగిన ప్రదేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. దేవాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. దైవభక్తితో మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితీ కన్వీనర్ బాలనర్సయ్య, విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడు నంద కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల వెల్లువ

దౌల్తాబాద్(దుబ్బాక) : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ మండల తహసీల్దార్ చంద్రశేఖర్ రావ్ సూచించారు. రెవెన్యూ సదస్సులకు రైతుల నుంచి దరఖాస్తుల భారీగా వస్తున్నాయన్నారు. అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల పరిధిలోని ముత్యంపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్ రావ్, జూనియర్ అసిస్టెంట్‌లు రాజేష్, శ్రావణ్, సౌజన్య రైతులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదె మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడింది. దీంతో మండల పరిధి మర్రిముచ్చాల గ్రామానికి చెందిన వంగ భాస్కర్ రెడ్డి పాడిగేదె మృతి చెందింది. గేదె మృతితో రూ.లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

నవోదయలో ‘పోలింగ్’

- వినూత్నంగా విద్యార్థి ప్రతినిధుల ఎన్నిక
- ఓటింగ్‌లో ఉత్సాహంగా విద్యార్థులు
- ఎన్‌సీసీ క్యాడెట్ల బందోబస్తు
- పర్యవేక్షించిన ప్రిన్సిపాల్, అధ్యాపకులు


నవోదయ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ


ఓటర్ వేలుకు సిరా అంటిస్తున్న పోలింగ్ అధికారి

వర్గల్(గజ్వేల్): వర్గల్ నవోదయ పాఠశాలలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నికను బుధవారం నిర్వహించారు. బ్యాలెట్ పేపర్లు, పోలింగ్ బూత్, ఖాకీ డ్రెస్సుల్లో బందోబస్తు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు, పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన విద్యార్థులు, పేరు నమోదుచేసి, వేలికి సిరా వేస్తూ బ్యాలెట్ పేపర్ అందజేస్తున్న పోలింగ్ ఆఫీసర్లు, బ్యాలెట్ బాక్సులో పేపర్ వేసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ వినూత్న కార్యక్రమం బుధవారం వర్గల్ నవోదయ విద్యాలయలో విద్యార్థి ప్రతినిధుల ఎన్నిక సందర్భంగా ఆవిష్కృతమైంది. ప్రిన్సిపాల్ రాజేందర్ పర్యవేక్షణలో మల్టీపర్పస్ హాల్‌లో ప్రజాప్రతినిధుల ఎన్నిక పోలింగ్‌ను తలపించేలా కొనసాగిన ఓటింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 242 మంది బాలురు, 179 మంది బాలికలు ఓటు ద్వారా ప్రజాస్వామ్యయుతంగా స్కూల్ కెప్టెన్, అసోసియేట్ కెప్టెన్, మెస్ కెప్టెన్, అసోసియేట్ మెస్ కెప్టెన్, సీసీఏ కెప్టెన్, అసోసియేట్ సీసీఏ కెప్టెన్, గేమ్స్ కెప్టెన్, అసోసియేట్ గేమ్స్ కెప్టెన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి విజేతల పేర్లు ప్రకటించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవర్చడం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించడం కోసం పోలింగ్ ప్రక్రియ దోహదపడుతుందని ప్రిన్సిపాల్ రాజేందర్ పేర్కొన్నారు.

దుకాణాదారులకు ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్


దుకాణాదారుడికి ట్రేడ్ లైసెన్స్ అందజేస్తున్న కమిషనర్

దుబ్బాక: దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని కమిషనర్ రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలో పర్యటించి పలు దుకాణాలను సందర్శించి దరఖాస్తులు చేసుకున్న వ్యాపారులకు ట్రేడ్‌లైసెన్స్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 2025–26 సంవత్సరానికి మున్సిపల్‌లో 471 వ్యాపార సముదాయాలు ఉండగా ఇప్పటివరకు కేవలం 23 మంది మాత్రమే లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకున్నారని తెలిపారు. మిగతా 448 దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. వ్యాపారాలను బట్టి రుసుమును నిర్ణయించామన్నారు. వ్యాపారస్తులు ట్రేడ్‌లైసెన్స్‌లు తీసుకోవడం వల్ల బ్యాంకు రుణాలు పొందవచ్చని, అగ్ని ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పరిహారం లభిస్తుందన్నారు. ప్రతి వ్యాపారుడు ట్రేడ్‌లైసెన్స్ తీసుకొని దుకాణం నిర్వహించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, ఏఈ శ్రీకాంత్, ప్రవీణ్, దిలీప్ తదితరులు ఉన్నారు.

ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి

హుస్నాబాద్: పట్టణంలోని కొత్త దుకాణాల యజమానులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని బుధవారం మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. స్వచ్ఛత 100 రోజుల కార్యాచరణలో భాగంగా ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో మురికి కాలువలను శుభ్రం చేయించారు. దుకాణదారులు ప్రతి సంవత్సరం ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. 20వ వార్డులో చెత్త విభజనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్‌రావు, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2025–26 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ పాఠశాల పథకం ద్వారా గిరిజన విద్యార్థుల నుంచి 3, 5, 8వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అఖిలేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 17సా. 5 గంటలలోపు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో
అందించాలన్నారు.

కస్తూర్బాలో ఇంటర్ కోర్సులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మడద రోడ్డులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఎంఈఓ మనీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీ, ఎంఎల్‌టీ ఇంగ్లీష్ మీడియంలో ఒక్కొక్క గ్రూపులో 40 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్మీడియట్ తరగతులు బోధించుటకు తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్ , సివిక్స్ ఇంగ్లీష్ మీడియంలో బోధించుటకు ఎంఏ, బీఈడ్ అర్హత గల వారు 13 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంఎల్టీ విద్యార్థులకు బోధించుటకు బి.ఫార్మసీ, ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల విక్రయాలను, అధిక ఫీజులను ని యంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ అన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యా శాఖ అనుమతులు లేని పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం ఉచిత అడ్మిషన్లు పేద విద్యార్థులకు కేటాయించాలన్నారు. జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను పరిష్కరించాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం చేస్తున్న మంత్రి పొన్నం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడేం సారయ్య, బండోజు గణేష్ ఇటీవల బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు మరణించారు. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందజేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక టీ స్టాల్ వద్ద టీ తాగుతూ కార్యకర్తలతో ముచ్చటించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పలు సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం స్ఫూర్తిదాయకం


సంతాప సభలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బాధలోనూ అవయవదానం చేయడం స్ఫూర్తిదాయమమని పట్టు పరిశ్రమ శాస్త్రవేత్తలు డా.ప్రవీణ్‌కుమార్, డా. వినోద్‌కుమార్, డా.రాఘవేంద్ర, ఏడీ ఇంద్రసేనారెడ్డిలు అన్నారు. మండలంలోని చంద్లాపూర్‌లో పట్టు రైతు జిల్లా అధ్యక్షుడు ఐలయ్య కుమారుడు వెంకటేశ్ ఇటీవల మృతి చెందగా బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు. వారు మాట్లాడుతూ.. పట్టు సాగులో ఎంతో ఆదర్శంగా నిలిచిన కుటుంబంలో ఇలాంటి సంఘటన జరగడం విషాదకరమన్నారు. ఐలయ్య కుమారుడు మృతి చెందినప్పటికీ మరొకరికి జీవం పోసేలా అవయవదానం చేసి ఆదర్శంగా నిలిచారన్నారు.

కేసీఆర్ విచారణతో కాంగ్రెస్ పతనానికి నాంది

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి


బీఆర్‌ఎస్ శ్రేణులతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ సాధించిన మాజీ సీఎం కేసీఆర్‌పై విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ బీఆర్‌కే భవన్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను విచారించడమంటే కాంగ్రెస్ ప్రభుత్వం పతనానికి రోజులు అసన్నమైనట్లే అన్నారు. ప్రపంచంలోనే అద్భుతమైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ఆరోపణలతో వేధింపులకు గురి చేయడం సిగ్గు చేటన్నారు. కాళేశ్వరంపై ధర్మం , న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

కెనాల్ శుద్ధీకరణ వేగవంతం చేయండి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్


అధికారులకు సూచనలు చేస్తున్న ఆశ్రిత్

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ పరిధిలోని కోమటిచెరువు–నర్సాపూర్ కెనాల్ శుద్ధీకరణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన కెనాల్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కెనాల్‌లో చెత్త, చెదారం తొలగించి, ఇరువైపులా ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. భవిష్యత్‌లో కెనాల్‌కు ఇరువైపులా వాకర్స్ నడిచేలా రోడ్డు మార్గం వెంబడి చెట్లను పెంచాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అంతకుముందు పట్టణంలోని మురికి కాల్వలను పరిశీలించారు. పలు చోట్ల పూడికతీత పనులు చేపట్టాలని తెలియజేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ ప్రేరణ, సుడా సీపీఓ వందనం టౌన్ ప్లానింగ్ అధికారి దేవరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


మిరుదొడ్డి(దుబ్బాక): ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, 20 వార్డ్ కౌన్సిలర్ మహమ్మద్ రియాజుద్దీన్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం సాజీద్ పుర, సంజీవయ్యనగర్, అంబేడ్కర్ నగర్‌ల్లో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపట్టారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా రేవంత్‌రెడ్డి సర్కార్ విద్యకు పెద్దపేట వేస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అంగన్‌వాడీల ర్యాలీలు

మిరుదొడ్డి(దుబ్బాక): అమ్మమాట– అంగన్‌వాడీ బాట వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో దుబ్బాక ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ర్యాలీలు నిర్వహించారు. మూడు సంవత్సరాలు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు, తల్లులకు మంచి పౌష్టికాహారం అందుతుందంటూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

అంగన్‌వాడీలకు పంపాలి


బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న సీడీపీఓ జయమ్మ

బెజ్జంకి(సిద్దిపేట): చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సీడీపీఓ జయమ్మ సూచించారు. బెజ్జంకిలో బుధవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చిన్నారుల వివరాలు తెలుసుకున్నారు. వారి తల్లులకు బొట్టు పెట్టి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరణి, అంగన్‌వాడీ టీచర్లు జయలక్ష్మి, భూదేవి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


మిరుదొడ్డి(దుబ్బాక): సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అనుమతులు లేని దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఏ అంజయ్య హెచ్చరించారు. బుధవారం మండలంలోని చెప్యాలలోని శ్రీ కృష్ణసాయి సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను దుబ్బాక ఏడీఏ మల్లయ్యతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ డీలర్ సరిగ్గా స్టాక్ రిజిస్టర్లు, బిల్ రికార్డులు చేయని కారణంగా సీడ్ అమ్మకాలను 15 రోజుల పాటు నిలిపేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన గడువులోగా బిల్ బుక్కులు, స్టాక్ రిజిస్టర్లు నమోదు చేయకపోతే దుకాణంలోని రూ. 6 లక్షల విలువైన 150 బ్యాగుల విత్తనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. విత్తన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మల్లేశం, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సాగు పద్ధతులపై అవగాహన

అక్కన్నపేట(హుస్నాబాద్): దిగుబడినిచ్చె మేలైన విత్తనాలను ఎంపిక చేసి సాగు చేసుకోవాలని ఏరువాక కేంద్రం, తోర్నాల శాస్త్రవేత్త డా.సిహెచ్ పల్లవి సూచించారు. బుధవారం అక్కన్నపేట మండలంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. యూరియా వాడకాన్ని తగ్గించి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. రైతులు విత్తనాలు కొన్నప్పుడు రసీదును భద్రపరచుకోవాలని తెలిపారు. వివిధ పంటల్లో సాగునీటిని ఆదా చేసే అవసరమైన పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ పంటల వివరాలు, చెట్ల పెంపకం లాంటి అంశాలపై రైతులకు క్లుప్తంగా అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, ఏఈఓలు సబియా, శ్రీలత, సింధూజ, రాధ, చంద్రప్రకాశ్, శేఖర్, శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి

యాజమాన్య పద్ధతులతో లాభాలు

శాస్త్రవేత్త డా. ప్రతాప్‌రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): యాజమాన్య పద్ధతులతోనే అధిక లాభాలు సాధించవచ్చని శాస్త్రవేత్త డా. ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నకోడూరు రైతు వేదికలో పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట పంటలైన జీలుగు, జనుము, జీవన ఎరువులైన పీఎస్‌బీ వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. సేంద్రియ వ్యవసాయంలో జీవామృతం తయారు గురించి వివరించారు. ఎఫ్‌పీఓ స్థాపన వల్ల కలిగే లాభాల గురించి తెలియజేశారు. వరిలో వాడే యంత్రాలు, డ్రోన్‌ల ఉపయోగం గురించి చెప్పారు. కార్యక్రమంలో ఏఓ జయంత్‌కుమార్, తదితరులు రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 12 గంటల ఉపవాస ప్రార్థనలు

హుస్నాబాద్: ప్రపంచ శాంతి, భారతదేశం గురించి క్రైస్తవులు బుధవారం పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో 12 గంటల ఉపవాస ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె. సోలమన్ రాజు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల క్షేమం, అనేక సమస్యల నిమిత్తం ప్రార్థించినట్లు తెలిపారు. వర్షాలు సకాలంలో కురిసి రైతులు, ప్రజలు అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు చెప్పారు.

◆ విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ మైత్రివనం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్‌ల కింద చెట్లకొమ్మల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేఆర్‌చౌరస్తా, మైత్రివనం, వినాయకనగర్, మారుతినగర్, రాజేంద్రనగర్, కాకతీయనగర్, ఆదర్శనగర్, మహాశక్తినగర్, విఘ్నేశ్వర్‌నగర్‌లో ఉ. 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

◆ పాఠశాలల్లో పరిశుభ్రత అందరి బాధ్యత

దౌల్తాబాద్ (దుబ్బాక): పాఠశాలల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. అనంతరం మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్న భోజన వంట కార్మికులకు స్కావెంజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా సమన్వయంతో పని చేస్తేనే పాఠశాల పరిశుభ్రంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు వంద శాతం న్యాయం చేసిన వాళ్ళం అవుతామన్నారు.

◆ సర్కారు బడిపాట ఆవిష్కరణ

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, తల్లిదండ్రులు వృథా ఖర్చులు చేయొద్దని మండల విద్యాశాఖాధికారి కిష్టయ్య అన్నారు. పట్టణ కేంద్రానికి చెందిన కవి, ఉపాధ్యాయుడు తిరుమల కాంతికృష్ణ రాసిన సర్కారు బడిపాటను బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విషయాలన్నీ వివ రిస్తూ కాంతికృష్ణ పాట రాశారని, గడ్డం శ్రీను గానం చేయగా సత్య చక్కని సంగీతం రూపొందించారన్నారు.

◆ ట్రాక్టర్ల నిర్వహణ చేయలేం

మద్దూరు(హుస్నాబాద్): గత 18 నెలలుగా గ్రామాల్లో ఆర్థిక ఇబ్బందుల కారణంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ల నిర్వహణ చేయలేమని, గ్రామ పంచాయతీల కార్యదర్శులు అన్నారు. బుధవారం మద్దూరు ఎంపీఓకు ట్రాక్టర్‌ల తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ల నిర్వహణ, డీజిల్ వ్యయాలు తమ సొంత డబ్బులు చెల్లించామన్నారు. ఇప్పటివరకు చెల్లించిన డబ్బులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

◆ పరిసరాల పరిశుభ్రంతో ఆరోగ్యం

గజ్వేల్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినపుడే ఆరోగ్యంగా ఉంటామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తూప్రాన్ రోడ్డు మార్గంలోని నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అలాగే, పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో ఎడ్యుకేషన్ హబ్‌ల్లోని తరగతి గదులు, పరిసరాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇళ్ల ముందుకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు.

◆ మార్కెట్ యార్డ్‌ను ఏర్పాటు చేయండి

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేటలో నూతనంగా వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బుధవారం ఒక ప్రకటన ద్వారా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ ముత్తినేని వేణుగోపాల్ రావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో చాలా మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. మండలంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందన్నారు. పండ్లు, కూరగాయాలను రైతులు పండించిన పంటలను ఎగుమతి చేయవచ్చని చెప్పారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నాయకులు కృషి చేయాలని, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆదిత్య అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నూతన నగర కార్యవర్గాన్ని ప్రకటించారు. నగర అధ్యక్షుడిగా స్వప్న, నగర కార్యదర్శిగా పరశురాం , ఉపాధ్యక్షుడిగా వసంత్, లోకేష్, సంయుక్త కార్యదర్శులుగా అజయ్, ధర్మతేజ, జోనల్ ఇన్‌చార్జిలుగా అనీష్, సాయి శంకర్, భానులను నియమించారు.